హామీల అమలు జగన్‌కే సాధ్యం

- పోలవరం ఎమ్మెల్యే తెల్లం బాలరాజు
- వింజరం సచివాలయ పరిధిలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం


గుండం బోరు గ్రామంలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే తెల్లం బాలరాజు

కుక్కునూరు: వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 2019 ఎన్నికల్లో ఇచ్చిన హామీలను పక్కాగా అమలు చేసి చూపించారని, పేద, మధ్యతరగతి వర్గాల కుటుంబాలకు అండగా ఉన్నారని పోలవరం ఎమ్మెల్యే తెల్లం బాలరాజు అన్నారు. మండలంలోని కుక్కునూరు మండలం వింజరం సచివాలయం పరిధిలో గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమం నిర్వహించారు. తొలుత వింజరం సచివాలయం పరిధిలో, బర్లమడుగు, జిన్నెలగూడెం, కొండపల్లి, కోయగూడెం, గుండంబోరు, ఎర్రబోరు, ముత్యాలమ్మపాడు గ్రామాల్లో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ప్రతి ఇంటికి వెళ్లి జగన్‌మోహన్‌రెడ్డి చేస్తున్న అభివృద్ధి సంక్షేమ పథకాల గురించి వివరించారు. అలానే అందరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. ఇంకా అర్హత ఉండి ఎవరికైనా సంక్షేమ పథకాలు రానివారు ఉంటే తెలియజేయాలని సూచించారు. గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో భాగంగా ప్రతి ఇంటికి వెళ్లిన తరుణంలో అక్కడ స్థానికంగా ఉన్న సమస్యలు మహిళలు బర్లమడుగు నుంచి జిన్నెలగూడెం వరకు మట్టిరోడ్డు కావాలని, వైఎస్సార్ జలకళలో మంచినీటి బోర్లు కావాలని, ప్రతి గ్రామంలో సీసీ రోడ్లు కావాలని ఎమ్మెల్యేను కోరారు. వెంటనే స్పందించిన బాలరాజు సంబంధిత అధికారులను పిలిచి కనీస మౌలిక సదుపాయాలు యుద్ధ ప్రాతిపదికన చేపట్టాలని ఆదేశాలు జారీ చేశారు. అనంతరం వింజనం సచివాలయం పరిధిలో బర్లమడుగు, గుండంబోరు రెండు గ్రామాలలో రూ.25 లక్షల చొప్పున మొత్తం రూ.50 లక్షల వ్యయంతో కొత్తగా నిర్మాణం చేపట్టే వాటర్ ట్యాంకులకు శంకుస్థాపన చేసి పనులు వెంటనే ప్రారంభించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. వింజరం గ్రామంలో ఉన్నటువంటి సీఎస్ఐ చర్చిలో ప్రీ క్రిస్మస్ వేడుకలలో పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం అక్కడికి వచ్చిన ప్రజలకు నాయకులు కార్యకర్తలకు, అధికారులకు, మీడియా మిత్రులకు అందరికి ముందుగా క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేశారు. అలాగే వింజనం గ్రామంలో ప్రజాదర్బార్ కార్యక్రమం ఏర్పాటు చేసి అక్కడకు వచ్చిన మహిళలు సమస్యలను అడిగి తెలుసుకుని వెంటనే వాటిని కూడా పూర్తిచేయాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా బాలరాజు మాట్లాడుతూ ప్రజా సంక్షేమమే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలన సాగిస్తున్నారని వివరించారు, అర్హత ఒకటే ప్రామాణికంగా ప్రతి ఒక్కరికీ ఇంటికే సంక్షేమ పథకాలు అందించి, ఇచ్చిన హామీలను 99 శాతం నెరవేర్చి రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారని తెలిపారు. ప్రతి గ్రామంలో ఏ ఇంటికి వెళ్లినా కుల మత రాజకీయాలకు అతీతంగా ప్రజలు ఘన స్వాగతం పలుకుతున్నారని అన్నారు. ఇంకా ఏమైనా ఇబ్బంది ఉంటే చెప్పాలని అధికారులు దృష్టికి తీసుకెళ్లి వెంటనే సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ జగడి బాలరాజు, వైస్ ఎంపీపీ.1 తాండ్ర రాజేష్, జెడ్పీటీసీ కుంజా నాగేశ్వరరావు, మండల పార్టీ అధ్యక్షుడు కుచ్చర్లపాటి నరసింహారాజు, ప్రజా ప్రతినిధులు, ఎంపీటీసీలు, సర్పంచులు, వార్డ్‌మెంబర్లు, మండల నాయకులు, కార్యకర్తలు, జేసీఎస్ కన్వీనర్లు, గ్రామ సచివాలయ కన్వీనర్లు, సోషల్ మీడియా కన్వీనర్, గృహసారథులు, వివిధ శాఖల అధికారులు, సచివాలయం సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు కొండపల్లి రైతుల వినతి

పోలవరం ప్రాజెక్టు భూసేకరణలో భాగంగా ఉమ్మడి రాష్ట్రంలో ఎకరాకు రూ.1.15 లక్షల పరిహారాన్ని తీసుకున్న రైతులకు ప్రభుత్వం రూ.5 లక్షలు పరిహారం చెల్లించేందుకు నోటిఫికేషన్ ఇచ్చిందని, అయితే కొండపల్లి గ్రామానికి సంబంధించి 70 మంది రైతుల పేర్లు ఆ నోటిఫికేషన్‌లో లేవని, దీంతో తమకు తీవ్ర నష్టం వాటిల్లుతుందని బాధిత రైతులు ఎమ్మెల్యే బాలరాజు వద్ద ఆవేదన వ్యక్తం చేశారు. తమకు న్యాయం చేయాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారికి న్యాయం చేస్తానని ఎమ్మెల్యే బాలరాజు హామీ ఇచ్చారు.

క్లుప్తంగా

‘మద్ది’లో పురందేశ్వరి పూజలు


మద్ది అంజన్నను దర్శించుకున్న పురందేశ్వరి

జంగారెడ్డిగూడెం రూరల్: బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురంధేశ్వరి గురవాయిగూడెం మద్ది ఆంజనేయస్వామి ఆలయాన్ని శనివారం సందర్శించారు. ఆలయ పూజారులు పూర్ణ కుంభంతో పురందేశ్వరికి స్వాగతం పలకగా ఆమె స్వామి వారిని దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అంతకుముందు పుట్లగట్లగూడెం గ్రామం వద్ద నిర్మిస్తున్న గ్రీన్ ఫీల్డ్ నేషనల్ హైవే పనులను ఆమె సందర్శించారు. పలువురు బీజేపీ నేతలు ఆమె వెంట ఉన్నారు.

బాధితులకు ఆర్థిక సాయం

బుట్టాయగూడెం(జీలుగుమిల్లి): జీలుగుమిల్లి మండలం అంకన్నగూడెం సమీపంలోని దిబ్బగూడెంలో ఇటీవల జరిగిన అగ్నిప్రమాదంలో నిరాశ్రయులైన కుటుంబాన్ని వైఎస్సార్ సీపీ నాయకుల బృందం శనివారం పరామర్శించి ఆర్థిక సహాయం అందజేసింది. రూ.4 వేల నగదు, నిత్యావసర వస్తువులను బాధితులు ముచ్చిక మంగరాజు, లక్ష్మీదేవిలకు ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు అందజేశారు

కొయ్యలగూడెం: శ్రీరంగపట్నంలో సంభవించిన అగ్నిప్రమాద బాధితులకు పలు స్వచ్ఛంద సంస్థలు ఆర్థిక సహాయం అందించాయి. మానవత, స్పందన స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు బాధితులకు రూ.5 వేలు నగదు, నిత్యావసర సరుకులు, దుస్తులను పంపిణీ చేశారు.

ఎమ్మెల్సీ సాబ్జి మృతికి సంతాపం


సాబ్జి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు

ద్వారకాతిరుమల: ఉభయగోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ షేక్ సాబ్జి మృతికి మండల ఉపాధ్యాయులు శనివారం సంతాపం తెలిపారు. స్థానిక ఒక అతిథి గృహంలో ఏర్పాటు చేసిన సంతాప సభలో సాబ్జి చిత్రపటానికి వారు పూలమాలలు వేసి, ఘన నివాళులర్పించారు. ఎంఈఓ–2 పరసా వెంకట్రావు, ఉపాధ్యాయులు సుభాకర్, గెడ్డం దేవానందరావు, కట్టా శ్రీను, బి.జయరాజు తదితరులున్నారు.

పోలవరం రూరల్: పోలవరంలో అంగన్‌వాడీ వర్కర్స్ సమ్మె 5వ రోజుకు చేరుకుంది. సమ్మెలో అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ షేక్ సాబ్జి మృతికి సంతాపం ప్రకటించారు.

రబీ పంటలపై శిక్షణ

చింతలపూడి: మండలంలోని ఆర్‌బీకే ఇన్‌చార్జులకు శనివారం రబీ పంటలపై ఏలూరు ఏరువాక కేంద్రం శాస్త్రవేత్తలు ఫణికుమార్, చాముండేశ్వరి శిక్షణ నిర్వహించారు. వరి, వేరుశనగ, మొక్కజొన్న పంటలను క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. విత్తన శుద్ధి, కత్తెర పురుగు నివారణ, కలుపు నివారణ, జింక్ లోపంపై ఆర్‌బీకే సిబ్బందికి అవగాహన కలిగించారు.

పంటనష్టం వివరాల ప్రదర్శన

పోలవరం రూరల్: మిచాంగ్ తుపాను ప్రభావంతో నష్టపోయిన రైతుల వివరాలను రైతు భరోసా కేంద్రాల్లో ఏర్పాట్లు చేసినట్లు మండల వ్యవసాయ శాఖాధికారి కె.రాంబాబు తెలిపారు. మండలంలోని ఎల్ఎన్‌డీపేట, ప్రగఢపల్లి, వింజరం, ఇటుకిలకోట, జిల్లెళ్లగూడెం ప్రాంతాలకు చెందిన లబ్ధిదారుల వివరాలను ఆయా రైతు భరోసా కేంద్రాల్లో ప్రదర్శించారు.

చిన వెంకన్నను దర్శించిన సినీ క్యారెక్టర్ ఆర్టిస్ట్


క్షేత్రంలో కుటుంబ సభ్యులతో సినీ క్యారెక్టర్ ఆర్టిస్ట్ చిన్నా

ద్వారకాతిరుమల: శ్రీవారి దివ్య క్షేత్రాన్ని సినీ క్యారెక్టర్ ఆర్టిస్ట్ చిట్టి (చిన్నా) శనివారం సందర్శించారు. కుటుంబ సమేతంగా ఆలయానికి విచ్చేసిన ఆయన ముందుగా స్వామి, అమ్మవార్లను దర్శించారు. అనంతరం ఆలయ ముఖ మండపంలో పండితుల నుంచి వేద ఆశీర్వచనాన్ని పొందారు.

శ్రీవారి సేవలో ఇంటెలిజెన్స్ ఏడీజీ

చినవెంకన్న క్షేత్రాన్ని ఇంటెలిజెన్స్ బ్యూరో అడిషనల్ డీజీ రావాడ ఆజాద్ చంద్రశేఖర్ శనివారం రాత్రి సందర్శించారు. సతీసమేతంగా ఆలయానికి విచ్చేసిన ఆయన స్వామి, అమ్మవార్లను దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయనకు ఆలయ సూపరింటెండెంట్ రమణరాజు శ్రీవారి జ్ఞాపికను, ప్రసాదాలను అందజేశారు.

నిత్యాన్నదాన ట్రస్ట్‌కు విరాళం

శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్ట్‌కు నిజామాబాద్‌కు చెందిన గరిమెళ్ల ప్రవీణ్, లక్ష్మీప్రసన్న దంపతులు శనివారం రూ.1,00,011 విరాళంగా అందజేశారు. ముందుగా వారు స్వామి, అమ్మవార్లను దర్శించారు. దాత దంపతులకు ఆలయ ఏఈఓ మెట్టపల్లి దుర్గారావు విరాళం బాండ్ పత్రాన్ని అందించారు.

నలుగురిపై కేసు నమోదు

జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెంలో పోలీసులు వాహన తనిఖీలు నిర్వహించారు. డీఎస్పీ ధనుంజయుడు ఆదేశాలమేరకు ట్రైనీ డీఎస్పీ దివ్య, సీఐ పి.రాజేష్ తనిఖీ నిర్వహించారు. డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహించి మద్యం తాగి వాహనాలు నడుపుతున్న నలుగురిపై కేసు నమోదు చేశారు.

పొలంలోకి దౌర్జన్యంగా ప్రవేశించారని..

జంగారెడ్డిగూడెం: కోర్టు ఉత్తర్వులు ఉన్నప్పటికీ తన పొలంలోకి దౌర్జన్యంగా ప్రవేశించారని అత్యం రాంబాబు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు హెచ్‌సీ పీసీహెచ్ శ్రీనివాసరెడ్డి తెలిపారు. పేరంపేటకు చెందిన అత్యం రాంబాబు తిరుమలాపురంలో తనకు ఉన్న వ్యవసాయ భూమిలో జీడి చెట్లు వేశారు. వెంకటరామానుజపురానికి చెందిన దోరపల్లి పుష్పాంజలి, మరో ఇద్దరు ఆ చెట్లను నరికి పట్టుకుపోయారని స్థానిక జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో రాంబాబు ఫిర్యాదు చేయగా, కోర్టు టెంపరరీ ఇంజక్షన్ ఆర్డర్ ఇచ్చింది. కోర్టు ఉత్తర్వులను ధిక్కరిస్తూ ఈ నెల 9న పుష్పాంజలి, మరో ఇద్దరు ట్రాక్టర్‌తో వచ్చి దౌర్జన్యంగా పొలాన్ని దున్నివేశారని రాంబాబు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

అంగన్‌వాడీ కేంద్రం వద్ద ఉద్రిక్తత

చింతలపూడి : ఫాతిమాపురం అంగన్‌వాడీ కేంద్రం వద్ద శనివారం ఉద్రిక్తత చోటుచేసుకుంది. అంగన్‌వాడీల సమ్మెతో బాలింతలకు, గర్భిణులకు, చిన్నారులకు ఇబ్బంది కలగకుండా ప్రభుత్వం సచివాలయ సిబ్బందిచే అంగన్‌వాడీ సెంటర్‌లను తెరిపించే ప్రయత్నం చేయగా ఫాతిమాపురం అంగన్‌వాడీ కేంద్రం నిర్వాహకురాలు నడ్డి సరోజిని అడ్డుకుంది. తాళాలు పగలగొట్టడానికి సిబ్బంది ప్రయత్నించగా సరోజిని పెట్రోల్ పోసుకుని ఆత్మహత్య చేసుకుంటానని హెచ్చరించడంతో అధికారులు వెనుదిరిగారు.

అంబేడ్కర్ ఆశయాలను ఆదర్శంగా తీసుకోవాలి


గణిజర్లలో డా బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించి సభలో ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే ఎలీజా

చింతలపూడి: భారతీయులు గర్వపడే విధంగా డా బీఆర్ అంబేడ్కర్ రాజ్యాంగాన్ని రచించారని ఎమ్మెల్యే ఉన్నమట్ల ఎలీజా కొనియాడారు. మండలంలోని గణిజర్ల గ్రామంలో శనివారం డా బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని ఆయన ఆవిష్కరించారు. అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే ఎలీజా మాట్లాడుతూ కుల రహిత సమాజం కోసం డా బీఆర్ అంబేడ్కర్ ఎనలేని కృషి చేశారని అన్నారు. ముఖ్యంగా దళితుల అభ్యున్నతికి డా బీఆర్ అంబేడ్కర్ చేసిన సేవలు మరువలేనివని అన్నారు. పేదలు, వెనుకబడిన వర్గాలు ఆర్థికంగా సామాజికంగా ఎదిగిననాడే అంబేడ్కర్‌కు నిజమైన నివాళి అన్నారు. అంబేడ్కర్ ఆశయాలను ఆదర్శంగా తీసుకుని యువత ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. అంబేడ్కర్ ఆశయాలకు అనుగుణంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలన సాగిస్తున్నారని తెలిపారు. సచివాలయాల స్థాపన ద్వారా గ్రామ స్వరాజ్యం తీసుకువచ్చారని అన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ ,మైనార్టీ వర్గాల అభివృద్ధికి కోట్లాది రూపాయలు ఖర్చు పెడుతున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో సర్పంచ్ బొల్లినేని వెంకట్రావు, ఎంపీటీసీ రాంబాబు, క్రిస్టియన్ మైనార్టీ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ పండు జగదీష్, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కోయ భాషను కాపాడుకుందాం


విద్యార్థులతో నినాదాలు చేస్తున్న ఆదివాసీ సంక్షేమ పరిషత్ సభ్యులు

పోలవరం రూరల్: భారత రాజ్యాంగం లోని ఆర్టికల్ 342 ప్రకారం ఆదివాసీ సంస్కృతి సంప్రదాయాలను, కోయ భాషను కాపాడాల్సిన బాధ్యత కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకోవాలని ఆదివాసి సంక్షేమ పరిషత్ రాష్ట్ర ప్రసార కార్యదర్శి సోడే మురళి, ఆదివాసి జేఏసీ రాష్ట్ర వైస్ చైర్మన్ తెల్లం శేఖర్ డిమాండ్ చేశారు. మండలంలోని బోడిగూడెం ఆంధ్రప్రదేశ్ గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాలలో శనివారం నిర్వహించిన జాతీయ రేలా పండుగ సమావేశంలో వారు మాట్లాడారు. 18 ఏళ్లు నిండిన యువతీ యువకులను కుటుంబంగా పరిగణించి తక్షణమే నష్టపరిహారం చెల్లించడంతో పాటు పోలవరం ప్రాజెక్టు ఏపీ జెన్‌కోలో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలన్నారు. 41.15 మీటర్ల కాంటూర్ లెవెల్‌లో ఉన్న పోలవరం బాధితులకు నష్ట పరిహారం చెల్లించాలని కోరారు. భూమికి భూమి, ఇల్లుకు ఇల్లు మొదలైనవన్ని 2013 భూ సేకరణ చట్టం ప్రకారం శాస్త్రీయ సమగ్ర పునరావాసం పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులకు యుద్ధ ప్రాతిపదికన కల్పించాలని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు డిమాండ్ చేశారు. 2024 ఫిబ్రవరి 9, 10, 11 తేదీలలో అల్లూరి సీతారామరాజు జిల్లా, రంపచోడవరం నియోజకవర్గం, చింతూరు మండల కేంద్రంలో నిర్వహించనున్న జాతీయస్థాయి ఆదివాసి సాంస్కృతిక సమ్మేళనం, సెమినార్‌ను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆదివాసి విద్యార్థినులు పాల్గొన్నారు.

ఘనంగా మూర్తిరాజు జయంతి


మూర్తిరాజుకు విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పిస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం: ప్రముఖ గాంధేయవాది, స్వాతంత్ర్య సమరయోధులు, దాత చింతలపాటి సీతారామచంద్ర వరప్రసాద మూర్తిరాజు జయంతిని శనివారం జంగారెడ్డిగూడెంలో ఘనంగా నిర్వహించారు. జంగారెడ్డిగూడెం అప్‌లాండ్ క్షత్రియ సేవా సమితి సభ్యులు మూర్తిరాజు విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో గోరంట్ల విజయరామరాజు, నంబూరి రామచంద్రరాజు, సత్యనారాయణరాజు, పీడీ నరసింహారావు, జగపతిరాజు, సోమరాజు, వేగేసిన సత్యనారాయణరాజు పాల్గొన్నారు. అనంతరం వృద్ధాశ్రమంలో వృద్ధులకు అన్నదానం నిర్వహించారు. స్థానిక ఛత్రపతి శివాజీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల వద్ద మూర్తి రాజు జయంతి వేడుకలు నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు, సిబ్బంది కళాశాల విద్యార్థులు మూర్తి రాజు విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డా.ఎన్.ప్రసాద్‌బాబు, ముఖ్యఅతిథిగా పాల్గొన్న రిటైర్డ్ ఫిజికల్ డైరెక్టర్ నరసింహారాజు మాట్లాడుతూ మూర్తి రాజు ఆశయం స్ఫూర్తిదాయకమని, ఆయన ఎన్నో విద్యా సంస్థలు నిర్మించి ఎంతో మందికి ఉన్నత భవిష్యత్తు కల్పించారన్నారు. అనంతరం సీతామహాలక్ష్మి స్వచ్ఛంద సేవా సంస్థకు 25 కిలోల బియ్యం, పండ్లను కళాశాల తరుపున అందజేశారు. దామోదర సంజీవయ్య ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కళాశాల వ్యవస్థాపకులు, విద్యాదాత మూర్తిరాజు జయంతిని ఘనంగా నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ బోడపాటి వెంకటేశ్వరరావు మూర్తిరాజు జీవితచరిత్రను విద్యార్థులకు వివరించారు. అధ్యాపకులు చలమాల శ్రీనివాసరావు, వి.సుబ్బారావు, రత్నం, మంగతాయారు, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కారానికి సహకరించాలి

ద్వారకాతిరుమల: భూ సమస్యల పరిష్కారానికి జి.కొత్తపల్లి రైతులు సహకరించాలని తహసీల్దార్ పి.సతీష్ కోరారు. స్థానిక పంచాయతీ కార్యాలయం వద్ద ఆయన అసైన్డ్‌మెంట్ భూముల సమస్యల పరిష్కారం నిమిత్తం శనివారం గ్రామ సభను నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ సతీష్ మాట్లాడుతూ భూ సమస్యల శాశ్వత పరిష్కారానికి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. అందులో భాగంగానే అసైన్డ్‌మెంట్ భూములపై అర్హులకు హక్కు పత్రాలను అందిస్తోందన్నారు. ఇప్పటికే మండలంలో అనేక మంది రైతులకు వాటిని అందజేశామన్నారు. ఇక్కడ కూడా అర్హులకు త్వరలో హక్కు పత్రాలను అందించేందుకు ఉన్నతాధికారులు తగు చర్యలు చేపడుతున్నట్టు చెప్పారు. భూ వివాదాలకు తావులేకుండా రైతులు తమకు పూర్తిస్థాయిలో సహకరించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కొస్సే శ్రీహరిరావు, వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు దాసరి ఏసురత్నం, రేగంటి వెంకటేశ్వరరావు తదితరులున్నారు.

వ్యక్తిపై కేసు నమోదు

జంగారెడ్డిగూడెం: కొట్టి గాయపర్చిన నేరంపై ఒక వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై వై.మంగయ్య తెలిపారు. పంగిడిగూడెం గ్రామానికి చెందిన తాడేపల్లి ప్రదీప్ కుమార్ ఈ నెల 16వ తేదీన ఇంటి వద్ద నిద్రిస్తుండగా, అదే గ్రామానికి చెందిన కోట రమేష్ అనే వ్యక్తి ప్రదీప్ కుమార్‌ను కొట్టి గాయపర్చాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై తెలిపారు.

మహిళ అదృశ్యంపై కేసు నమోదు

జంగారెడ్డిగూడెం: మహిళ అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు హెచ్‌సీ సీహెచ్ కోటేశ్వరరావు తెలిపారు. జంగారెడ్డిగూడెంకు చెందిన వేపకాలయ కాశీ విశ్వనాథ్‌కు దుర్గాదేవితో వివాహం కాగా వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఈ నెల 11వ తేదీ రాత్రి అందరూ నిద్రించగా ఉదయం లేచి చూసే సరికి దుర్గాదేవి కనిపించలేదు. ఆచూకీ కోసం ప్రయత్నించినా ఫలితం లేకపోవడంతో విశ్వనాథ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

బ్లాక్‌స్పాట్ ప్రాంతాల పరిశీలన


జంగారెడ్డిగూడెంలో బ్లాక్‌స్పాట్ ప్రాంతాలను గుర్తిస్తున్న డీఎస్పీ, పోలీసు అధికారులు

జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెంలో నేషనల్ హైవే 516 డి, స్టేట్ హైవేలపై ఉన్న బ్లాక్ స్పాట్ ప్రాంతాలను డీఎస్పీ ఎం.ధనుంజయుడు, సీఐ పి.రాజేష్, ఎస్సై మల్లికార్జునరెడ్డి, సిబ్బందితో కలిసి శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ రోడ్డు నియమ నిబంధనలు పాటిస్తూ సురక్షిత ప్రయాణాలను సాగించాలన్నారు. ముఖ్యంగా ద్విచక్రవాహనదారులు హెల్మెట్ ధరించి వాహనాలు నడపాలన్నారు.

ప్రజలకు జవాబుదారీగా ఉండాలి

చింతలపూడి: ప్రజలకు జవాబుదారీగా ఉండాలని జంగారెడ్డిగూడెం డీఎస్పీ ఎం.ధనుంజయుడు స్థానిక పోలీసులకు సూచించారు. చింతలపూడి పట్టణంలో నిర్మాణం పూర్తి చేసుకున్న నూతన పోలీస్ సర్కిల్ కార్యాలయాన్ని శనివారం డీఎస్పీ సందర్శించారు. ఈ సందర్భంగా సర్కిల్ కార్యాలయం ఆవరణలో మొక్కలు నాటారు.

పోలీస్ స్టేషన్‌లను పరిశీలించిన డీఎస్పీ

పోలవరం రూరల్: పోలవరంలో నూతనంగా నిర్మిస్తున్న పోలీస్ స్టేషన్ భవనాన్ని డీఎస్పీ జి.రత్నరాజు శనివారం పరిశీలించారు. త్వరితగతిన భవన నిర్మాణాలు పూర్తి చేయాలని సూచించారు. అనంతరం పోలవరం సర్కిల్ కార్యాలయాన్ని, పోలీస్ స్టేషన్‌లను పరిశీలించారు. స్టేషన్‌లో నమోదవుతున్న కేసుల వివరాలను, పురోగతిని పోలవరం సీఐ కె.విజయబాబు, ఎస్సై ఎస్ఎస్ పవన్‌కుమార్ తెలియజేశారు.